
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం। 7। జూలై। 2025



సోమశిలలో 30 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 30 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2,600, ఉత్తర, దక్షిణ కాలువలకు 825 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,060
3 శాతం జీఎస్టీతో	రూ.9,332
సవర (8 గ్రా)	రూ.74,656

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.3 /29.5

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం వరకు వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. ఆదివారం గాలిలో తేమ 46 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రైతులకు న్యాయవాదుల అండ

- కరేడులో ఐలు బృందం పర్యటన
- న్యాయ పోరాటం చేస్తాం



ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటున్న ఐలు బృందం

ఉలవపాడు: భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కరేడు రైతులకు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) మద్దతు ఉంటుందని ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం న్యాయవాదుల బృందం కరేడు ప్రాంతంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా రైతుల భూములు లాక్కోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే యూనియన్ అండగా ఉంటుందన్నారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు, ప్రభుత్వం ఉద్యమాన్ని అణచలేవన్నారు. రైతులకు వ్యతిరేకంగా ఉంటే ప్రభుత్వాలే కూలిపోతాయన్నారు. విజనరీకి ఆ మాత్రం తెలియదా అన్నారు. భూగర్భ సంపదను దోచుకోవడానికి ప్రయత్ని స్తున్నారనే అనుమానం కలుగుతుంది.

న్యాయ సహాయం అందిస్తాం

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఐలు అధ్యక్షులు నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 వేల మందికి జీవనాధారమైన భూములను తీసుకోవడం న్యాయం కాదన్నారు. కరేడు రైతులకు న్యాయ సహాయం అందిస్తామన్నారు. కుగ్రామాలన్నీ తిరిగి భూములు పరిశీలించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఐలు రాష్ట్ర కార్యదర్శి యస్. మాధవరావు, ఏపీ వైస్ ప్రెసిడెంట్ వి కోటేశ్వరరావు, సెక్రటేరియట్ ప్రెసిడెంట్ రమేష్, ఐలు నాయకులు రాజారత్నం, కిరణ్‌బాబు, అహ్మద్, వినోద్‌కుమార్, చీరాల బార్ అసోసియేషన్ నాయకులు గొట్టి ప్రసాద్, నెల్లూరు బార్ అసోసియేషన్ నాయకులు రమేష్, సాయికుమార్, బండా శ్రీనివాసులు, ఐ శ్రీనివాసులుతో పాటు పౌర హక్కుల సంఘ నాయకులు, వామపక్షాలు, సీఐటీయూ నాయకులు ఉన్నారు.

వరాల రొట్టె.. ఒడిసి పట్టు



భక్త జనసంద్రమైన స్వర్ణాల ఘాట్

స్వర్ణాల చెరువు.. కోర్కెల అర్థనకు వేదికైంది. వరాల రొట్టెలను ఒడిసి పట్టుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. మది నిండా భక్తి, విశ్వాసంతో కోరిన కోర్కె లు తీరి వదిలే రొట్టెలు, కోర్కెలతో రొట్టెలను పట్టుకునే భక్తులతో పవిత్ర స్వర్ణాల తీరం జన సంద్రంగా మారింది. బారాషహీద్‌లను దర్శించుకునేందుకు సింహపురిలో దారులన్నీ దర్గా వైపే మళ్లాయి. కుల, మత వర్ణభేదాలు లేకుండా తరలివచ్చిన స్వర్ణాల చెరువు భక్తులతో పోటెత్తింది. మతసామరస్యానికి ప్రతీకగా జరిగే రొట్టెల పండగ పటిష్ట ఏర్పాట్ల మధ్య ఆదివారం ఘనంగా ప్రారంభమైంది.

వైభవంగా ప్రారంభమైన రొట్టెల పండగ

- తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు
- బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు కిటకిట
- కోర్కెల రొట్టెలు ఇచ్చిపుచ్చుకున్న భక్తులు



దర్గా ప్రాంగణంలో బారాషహీదులను దర్శించుకుంటున్న భక్తులు

నెల్లూరు (బారకాసు): విద్య, ఉద్యోగం, విదేశీయానం, వ్యాపారం, ధనం, సౌభాగ్యం, వివాహం, ఆరోగ్యం, ప్రమోషన్, స్వగృహం.. ప్రతి ఒక్కరి కల. జీవితాశయం. బారాషహీదులు ఆశీస్సులతో స్వర్ణాల సాక్షిగా తీరుతాయనేది ప్రగాఢ విశ్వాసం. భక్తి ప్రపత్తులతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల మధ్య రొట్టెల పండగ ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. తొలి రోజు కోర్కెలు తీరిన భక్తులు వదిలే రొట్టెల కోసం కొత్త కోర్కెలతో రొట్టెలు తీసుకునేందుకు వచ్చిన భక్తులతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. స్వర్ణాల చెరువు వరాల రొట్టెలు మార్చుకునే భక్తులతో నిండిపోయింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల వారు, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాలు, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు. స్వర్ణాల చెరువులో పుణ్య స్నానాలు ఆచరించి తమ కోర్కెల రొట్టెల మార్పిడి చేసుకున్నారు. మత బోధకులైన యుద్ధ వీరుల త్యాగనిరతిని స్మరిస్తూ సమాధులను దర్శించుకున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న రొట్టెల పండగలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, కార్పొరేషన్ కమిషనర్ నందన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అంచనాకు మించి రెట్టింపు స్థాయిలో భక్తులు వచ్చినా ఆటంకాలు లేకుండా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు స్వచ్ఛందంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.





దర్శనానికి మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ప్రతి కోర్కె రొట్టెకు ప్రత్యేక ఘాట్

స్వర్ణాల చెరువులో సంప్రదాయబద్ధంగా స్నానమాచరించి రొట్టెలు ఇచ్చి పుచ్చుకోవడం ఆనవాయితీ. ఇందుకోసం ఏ కోర్కె రొట్టె ఎక్కడ దొరుకుతుందో వెతుకులాటతో భక్తులు ఇబ్బంది పడకూడదని అధికారులు ప్రతి కోర్కె రొట్టెకు ప్రత్యేక ఘాట్ ఏర్పాటు చేశారు. భక్తులు ఏ కోర్కెతో వచ్చారో ఆ ఘాట్‌లోకి వెళ్లి తమకు కావాల్సిన రొట్టెను అందుకుంటున్నారు. గతంలో తమ కోర్కెలు తీరిన భక్తులు రొట్టెలను వదులుతున్నారు. ఆరోగ్యం, సంతానం, విద్య, ఉద్యోగం, వ్యాపారం, గృహ, సౌభాగ్యం, వివాహం, విదేశీయానం రొట్టెల బోర్డులను ఏర్పాటు చేశారు.

స్వర్ణాల చెరువు వద్ద పక్కాగా ఏర్పాట్లు

బారాషహీద్ దర్గా స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు పట్టుకొనే భక్తుల కోసం నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెరువు లోతులోకి వెళ్లకుండా ఉండేందుకు చెరువులో కంచె, చెరువు ఘాట్ వద్ద నీటిని శుభ్రం చేసే యంత్రాలు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో షహదత్ సందల్ మాలి

నెల్లూరు (బృందావనం): రొట్టెల పండగ తొలి రోజు ఆదివారం సంప్రదాయంగా మత పెద్ద షబ్బీర్ సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 10.30 గంటలకు అమరులైన 12 మంది యోధులను స్మరిస్తూ దర్గా ప్రాంగణంలో బారాషహీద్‌ల సమాధుల చెంత షహదత్ (ప్రత్యేక పూజలు) నిర్వహించారు. 2 గంటల వరకు గులాములు, పన్నీరుతో పరిశుభ్రం చేశారు. సంప్రదాయంగా గంధం లేపనం చేసిన అనంతరం గలేఫాలు, చద్దర్లు కప్పి 'సందల్ మాలి' భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ ఘట్టాన్ని భక్తజనం కనులారా భక్తి శ్రద్ధలతో వీక్షించి పరవశించిపోయారు.

గంధ మహోత్సవం నేడు

బారాషహీద్ దర్గా రొట్టెల పండగలో అత్యంత ప్రాధాన్యత కలిగిన గంధ మహోత్సవం 2వ రోజు సోమవారం రాత్రి నిర్వహించనున్నారు. పవిత్రమైన గంధాన్ని 12 పవిత్ర కలశాలలో కోటమిట్టలోని అమీనియా మసీదు నుంచి సంప్రదాయంగా గంధాన్ని తీసుకు వచ్చి బారాషహీద్‌లకు లేపనం చేసి. అనంతరం భక్తులకు ఆ గంధాన్ని, ప్రసాదాన్ని పంచి పెట్టనున్నారు. ఎంతో విశేషంగా అంగరంగ వైభవంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు.

సర్కారు బడి.. కార్పొరేట్ పెత్తనం





వీఆర్ హైస్కూల్ ప్రాంగణం

వీఆర్ హైస్కూల్‌ను మున్సిపల్ హైస్కూల్‌గా మార్పు చేసి పునః ప్రారంభోత్సవానికి అంతా సిద్ధమైంది. ఓ ప్రైవేట్ కంపెనీ ఇచ్చిన సుమారు రూ.9 కోట్ల సీఎస్సార్ ఫండ్‌తో పాఠశాల భవనాలను, ప్రాంగణాన్ని ఆధునికీకరించారు. సర్కారు స్కూల్‌ను కార్పొరేట్ పెద్దలు తమ కబంధహస్తాల్లోకి తీసుకున్నారు. రాష్ట్ర మంత్రి నారాయణ ఈ పాఠశాలపై అజమాయిషీ బాధ్యతలను తీసుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండానే తన విద్యా సంస్థల్లో పని చేసే సిబ్బందిని, బోధకులను నియమించడంతోపాటు విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. తన పాఠశాలల్లో కేటాయించాల్సిన ఫ్రీ సీట్లను ఈ పాఠశాలకు మళ్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- వీఆర్ హైస్కూల్‌ను మున్సిపల్ హైస్కూల్‌గా మార్పు
- పునః ప్రారంభానికి ఎన్‌సీసీ కంపెనీ రూ.9 కోట్ల సీఎస్సార్ ఫండ్స్
- అంతా నారాయణ సిబ్బందిదే అజమాయిషీ
- ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండానే నారాయణ పాఠశాల బోధకుల నియామకం
- నేడు మంత్రి లోకేశ్‌తో ప్రారంభం



ఆధునికీకరించిన వీఆర్ హైస్కూల్ భవనం

నెల్లూరు (టౌన్): సర్కారు బడిపై కార్పొరేట్ మంత్రి నారాయణ పెత్తనం, ఆయన సాగిస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజల కోసం వెంకటగిరి రాజా కుటుంబీకులు వీఆర్ విద్యా సంస్థలను ప్రారంభించారు. ప్రస్తుతం వీఆర్ విద్యా సంస్థల వ్యవహారం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. అయితే మంత్రి నారాయణ కోర్టు వివాదంలో ఉన్న వీఆర్ ఎయిడెడ్ హైస్కూల్‌ను వీఆర్ మున్సిపల్ హైస్కూల్‌గా మార్పు చేస్తూ ప్రతిపాదనలు పంపించగా, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల భవనాలతోపాటు ప్రాంగణాన్ని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యం దాదాపు రూ.9 కోట్ల మేర సీఎస్సార్ ఫండ్స్‌ను ఖర్చు చేసింది. గత నెల 30వ తేదీన వీఆర్ హైస్కూల్‌లో తరగతులను అనధికారికంగా ప్రారంభించారు. సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో అధికారికంగా ప్రారంభించనున్నారు.

సిటీ నియోజకవర్గానికే పరిమితం

మంత్రి నారాయణ తన నియోజకవర్గం పరిధిలో ఉందన్న కారణంతో పాఠశాలలో కేవలం సిటీ నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకే అడ్మిషన్లు పరిమితం చేశారనే విమర్శలు వినిస్తున్నాయి. దీంతో జిల్లా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. వీఆర్ హైస్కూల్ పక్కనే ఉన్న గడియారం స్తంభం వరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధి ఉంది. అయితే ఆ నియోజకవర్గానికి చెందిన కేవలం 35 నుంచి 50 మంది విద్యార్థులకు మాత్రమే మొక్కుబడిగా అడ్మిషన్లు ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. వీఆర్ హైస్కూల్‌లో అడ్మిషన్లు జిల్లా వ్యాప్తంగా కల్పించాల్సి ఉన్నా కేవలం సిటీ నియోజకవర్గానికే పరిమితం చేయడంపై పలువురు విద్యావేత్తలు, ప్రజలు మండి పడుతున్నారు.

వీఆర్‌లో నారాయణ సిబ్బంది నియామకం

వీఆర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల నియామకానికి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు ఉండాలి. అయితే సచివాలయాల్లో పని చేస్తున్న క్వాలిఫైడ్ స్కూల్ అసిస్టెంట్లను 20 మంది వరకు నియమించారు. ప్రస్తుతం 8 మంది స్కూల్ అసిస్టెంట్లు, 10 ఎస్జీటీలను నియమించారు. మరో 15 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఐదుగురు ఎస్జీటీలు, ఇద్దరు హెడ్‌మాస్టర్లు కావాలని విద్యాశాఖకు లేఖ పంపించారు. వీరితోపాటు నారాయణ విద్యాసంస్థల్లో పనిచేసే మరో 25 మందికి పైగా సిబ్బందిని బోధన, బోధనేతర విభాగాల్లో నియమించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యా వలంటీర్‌ను నియమించాలన్న ప్రభుత్వ అనుమతి ఉండాల్సి ఉంది. అయితే ఇవేమి పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారులు మంత్రికి ఇష్టం వచ్చిన వారిని అనధికారికంగా నియమిస్తున్నారు. పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ అయినా అనుభవం లేకపోతే బోధన ఏ విధంగా చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ నేతల సిఫార్సులకే అడ్మిషన్లు

విద్యాహక్కు చట్టం 12/1సీ కింద జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి పేద పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పించాల్సి ఉంది. అయితే జిల్లాలో ఏ కార్పొరేట్ పాఠశాలతోపాటు నారాయణ విద్యా సంస్థల్లో కూడా ఉచిత ప్రవేశాలు ఇచ్చిన దాఖలాలు లేవు. ఇటీవల విద్యాహక్కు చట్ట ప్రకారం నారాయణ స్కూల్స్‌లో అడ్మిషన్లు ఇవ్వడం లేదని చాలా మంది తల్లిదండ్రులు కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఇటువంటి కొంత మంది విద్యార్థులకు వీఆర్ పాఠశాలలో అడ్మిషన్లు ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు టీడీపీ నేతలు సిఫార్సు చేసిన వారికి సైతం అడ్మిషన్లు కల్పించారని తెలిసింది. అయితే ఈ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల వ్యవహారాలను నారాయణ విద్యాసంస్థల్లో పనిచేసే సిబ్బంది, ఆయా డివిజన్లల్లో ఉండే పార్టీ ఇన్‌చార్జిలకు అప్పగించినట్లు తెలిసింది. వీరితోపాటు పేరుకు ఒకరిద్దరు సచివాలయ సిబ్బందిని కూడా నియమించారు. మొత్తం మీద 1 నుంచి 9వ తరగతి వరకు 1,050 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు.

జిల్లాలో అందరికీ అడ్మిషన్లు ఇవ్వాలి

జిల్లాలోని నిరుపేదలకు వీఆర్ హైస్కూల్‌లో అడ్మిషన్లు ఇవ్వాలి, కేవలం సిటీ నియోజకవర్గానికే పరిమితం చేయడం సరికాదు. విద్యాహక్కు చట్టం ప్రకారం వీఆర్ హైస్కూల్‌లో బోధన బోధనేతర సిబ్బందిని నియమించాలి. ప్రైవేట్ స్కూల్స్‌ల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించడం లేదు. మంత్రి లోకేశ్ చర్యలు తీసుకోవాలి.

– నరహరి, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ పేరెంట్స్ అసోసియేషన్

అడ్మిషన్లతో మాకు సంబంధం లేదు

వీఆర్ హైస్కూల్‌లో అడ్మిషన్ల వ్యవహారం పూర్తిగా సచివాలయ సిబ్బంది చూసుకున్నారు. ఉపాధ్యాయులను పూర్తి స్థాయిలో నియమిస్తాం. సచివాలయాల్లో పని చేసే క్వాలిఫైడ్ అసిస్టెంట్లను కొంత మందిని తీసుకున్నాం. వీఆర్ హైస్కూల్ ఇన్‌చార్జిగా జాకీర్‌హుస్సేన్‌నగర్ హెచ్‌ఎం నారాయణకు బాధ్యతలు అప్పగించాం.

– బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

నకిలీ మద్యం.. పెద్దల హస్తం

నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్థానిక అధికార పార్టీ నాయకులతోపాటు, ఎక్సైజ్ అధికారుల అండదండలతో ఎటువంటి ఆటంకాలు లేకుండా ఇప్పటి వరకు వీరాంజనేయులు దందాను యథేచ్ఛగా కొనసాగించాడని తెలుస్తోంది. మద్యం, బెల్టు దుకాణ యజమానులకు సైతం ఇది నకిలీ మద్యం అని తెలిసినా గట్టుచప్పుడు కాకుండా చాలా కాలంగా నిర్వహించారంటే ఈ పాపంలో కూటమి పార్టీల పెద్దల హస్తం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ప్రధాన నిందితుడు వీరాంజనేయులేనా

- గుడ్లూరు కేంద్రంగా గుట్టు చప్పుడు కాకుండా తయారీ
- ఏసీ ప్రీమియం బ్రాండ్‌తో క్వార్టర్ బాటిల్స్ మద్యం తయారీ
- మద్యం, బెల్టు షాపులకు బాటిల్ రూ.100లకే సరఫరా
- కూటమి పార్టీల నేతలు, పెద్దలు, ఎక్సైజ్ అధికారుల అండతోనే సాధ్యం!



గుడ్లూరులో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న కల్తీ మద్యం బాటిళ్లు (ఫైల్)

కందుకూరు: గుడ్లూరు కేంద్రంగా వెలుగు చూసిన నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో పలు విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధాన నిందితుడు వీరాంజనేయులు కూటమి పార్టీల నేతలు, పెద్దలతోపాటు ఎక్సైజ్ అధికారుల అండదండలతోనే చాలా కాలంగా గుట్టుచప్పుడు కాకుండా తయారీ చేసినట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం తయారీలో ఉన్న రేపల్లెకి చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో వీరాంజనేయులు నకిలీ మద్యం తయారీ గట్టును రట్టు చేయాల్సి వచ్చినట్లు సమాచారం.

వ్యసనాలకు బానిసై..

నకిలీ మద్యం తయారు చేస్తూ ఎక్సైజ్ శాఖ అధికారులకు పట్టుబడిన వీరాంజనేయులుది సొంత ఊరు గుడ్లూరు. అక్కడి స్థానిక అధికార పార్టీకి చెందిన నాయకుడితో ఇతనికి మంచి సంబంధాలు ఉన్నాయి. స్థానికంగా పేకాట శిబిరాలు నిర్వహించడంలో సదరు అధికార పార్టీ నేత సిద్ధహస్తుడు. ఆయన సహాయ సహకారాలు అందిస్తూ ఇద్దరూ కూడా పేకాట ఆడేవారు. ఈ క్రమంలో వీరాంజనేయులు భారీగా డబ్బులు పోగొట్టుకున్నట్లు సమాచారం. అందులో నష్టపోయిన డబ్బును సంపాదించడానికి నకిలీ మద్యం తయారీ చేసే అడ్డ దారిని ఎంచుకున్నట్లు ఎక్సైజ్ అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. మద్యం తయారీకి గుడ్లూరులోని మిట్టపాళెంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కల్తీ మద్యం తయారీ మెషిన్, ఇతర సామగ్రిని ఏర్పాటు చేశాడు. శనివారం చేసిన దాడుల్లో 6,200 ఖాళీ క్వార్టర్ బాటిల్స్‌తో పాటు, 3,500 ఏసీ ప్రీమియం క్వార్టర్ బాటిల్ లేబుల్స్ బయట పడ్డాయి.

ఎక్సైజ్ అధికారులకు తెలిసే జరుగుతుందా?

వీరాంజనేయులు గుడ్లూరులో చాలా కాలం నుంచి భారీ స్థాయిలో నకిలీ మద్యం తయారు చేస్తున్నాడు. బాహాటంగానే మద్యం షాపులతోపాటు, బెల్టు షాపులకు నకిలీ మద్యం సరఫరా చేస్తుంటే.. ఎక్సైజ్ అధికారులకు కానీ, అధికార పార్టీ నేతలకు కానీ తెలియదంటే నమ్మశక్యంగా లేదని పలువురు అంటున్నారు. కూటమి పార్టీల పెద్దల అండదండలు లేకపోతే నకిలీ మద్యం తయారీ చేయలేడని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులకు తెలిసే జరుగుతుందనే ప్రచారం ఉంది. అధికార పార్టీ నేతల సూచనలతోపాటు మామూళ్ల మత్తులో పడి వదిలేశారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉంటే కల్తీ మద్యం తయారీ నిందితుడు వీరాంజనేయులుకు అధికారులు దాడుల చేయనున్న సమాచారం ముందే అందడం ఈ అనుమానాలకు బలం చేకూరుతోంది. ఈ క్రమంలో భారీ స్థాయిలో నకిలీ మద్యాన్ని ఓ ఆటో ద్వారా తరలించినట్లు తెలుస్తోంది.

నెల్లూరు రొట్టెల పండగలో కల్తీ మద్యం విక్రయాలకు స్కెచ్

చాలా కాలంగా వీరాంజనేయులు ఏసీ ప్రీమియం క్వార్టర్ బాటిల్ పేరుతో కల్తీ మద్యాన్ని తయారు చేసి రూ.100లకే మద్యం, బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నాడు. ఇదే మద్యాన్ని షాపులు, బెల్టు షాపుల్లో రూ.160లకు విక్రయిస్తున్నారు. ఇలా కొన్ని వేల బాటిల్స్‌ను వీరాంజనేయులు సరఫరా చేసినట్లు సమాచారం. అయితే బెల్టు షాపులకు సరఫరా విషయంలో మద్యం షాపుల యజమానులకు, వీరాంజనేయులకు మధ్య తేడా రావడంతో కొంత కాలంగా మద్యం తయారీని నిలుపుదల చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం నెల్లూరులో రొట్టెల పండగ జరుగుతున్న నేపథ్యంలో కల్తీ మద్యాన్ని భారీగా తయారు చేసి విక్రయించాలని ప్రణాళిక వేసుకున్నాడు. దీని కోసం నెల్లూరుకు చెందిన మరో వ్యక్తితో కలిసి రొట్టెల పండగకు కేటాయించే దుకాణాల్లో ఒకటి తీసుకున్నట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి కార్గోలో 400 లీటర్ల స్పిరిట్ తెప్పించాడు. ఇందులో ప్రస్తుతం 300 లీటర్ల ఒరిజినల్ స్పిరిట్‌ను అధికారులు స్వాధీనం చేసుకోగా, మరో 100 లీటర్ల మిక్స్‌డ్ స్పిరిట్ ఉన్నట్లు గుర్తించారు.

ఇలా దొరికాడు

ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారులు బాపట్ల జిల్లా రేపల్లెలో నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడి చేసి కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాడు. అక్కడి కేసులో ఉన్న నిందితుడే వీరాంజనేయులకు కల్తీ మద్యం తయారీకి ఉపయోగించే స్పిరిట్ సరఫరా చేస్తున్నాడని గుర్తించారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు వీరాంజనేయులను అతని సెల్‌ఫోన్ డేటా ఆధారంగా పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ వీరాంజనేయులు పేరుతో నెల్లూరుకు చెందిన మరో వ్యక్తి సిమ్ కార్డు ఉపయోగిస్తుండడంతో అతన్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో వీరాంజనేయులు పట్టుబడినట్లు సమాచారం.

నిఘా నీడన రొట్టెల పండగ

- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ
- పోలీసుల తీరుపై స్థానికుల అసహనం


దర్గాలో ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): పోలీస్, సీసీ కెమెరాల నిఘా నీడన ఆదివారం బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ ప్రారంభమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. 1,700 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ నిమిత్తం స్వర్ణాల చెరువు ఘాట్, దర్గా ఆవరణలో మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశారు. మూడు పీటీజెడ్ కెమెరాలు, 67 సీసీ కెమెరాలు, పది డ్రోన్లను ఏర్పాటుచేసి పోలీసు అవుట్ పోస్టులోని తాత్కాలిక కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశారు. పోలీసు అధికారులు అక్కడి నుంచి పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. అవుట్ పోస్టు సిబ్బంది తప్పిపోయిన 28 మంది చిన్నారులను సంరక్షించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. క్రైమ్ పార్టీ సిబ్బంది ఓ జేబుదొంగను అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. సాయంత్రం ఎస్పీ జి.కృష్ణకాంత్, కలెక్టర్ ఒ.ఆనంద్‌తో కలిసి దర్గా ఆవరణ, క్యూలైన్లు, రొట్టెల మార్పిడి తదితర ప్రాంతాలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాల పనితీరుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. క్యూలైన్లలోని భక్తులు వీలైనంత త్వరగా దర్శనం చేసుకునేలా చూడాలన్నారు. క్రైమ్ పార్టీలు నేరాలు జరగకుండా చూడాలన్నారు. నేర నియంత్రణ చర్యలపై పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం ద్వారా భక్తులకు తెలియజేయాలని సూచించారు.

దారి మూసేయడంతో..

రొట్టెల పండగ సందర్భంగా కొందరు పోలీసుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. దర్గా వైపు వెళ్లే రహదారులను అధికారులు బారికేడ్లతో మూసివేయడంతో పొదలకూరురోడ్డు సెంటర్, జేవీఆర్ కాలనీ, లక్ష్మీనరసింహపురం, అంబేడ్కర్ నగర్, బ్రహ్మానందపురం, బట్వాడిపాళెం సెంటర్ తదితర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. తమ ఇళ్లు అక్కడేనని చెబుతున్నా వినిపించుకోకుండా వాహనాలు నిలిపివేశారు. దీంతో వారు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లో కాకుండా వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దర్గా ఆవరణలోనూ ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


కమాండ్ కంట్రోల్ నుంచి పరిశీలిస్తున్న ఎస్పీ


పోలీసు అవుట్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది


దర్గా ఆవరణలో పార్క్ చేసిన వాహనం

తల్లిని కాపాడబోయి..


వంశీ మృతదేహం


సీహెచ్‌సీ వద్ద కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబ సభ్యులు

- విద్యుదాఘాతానికి గురై తనయుడి మృత్యువాత
- మరుపూరులో విషాదం

పొదలకూరు: తనకు ప్రాణం పోసిన తల్లిని విద్యుత్ ప్రమాదం నుంచి కాపాడబోయిన ఓ తనయుడు తనువు చాలించాడు. ఈ విషాదకరమైన ఘటన మండలంలోని మరుపూరు ఎస్సీ కాలనీలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన ఆర్.వంశీ (30) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. వివాహమై నెలల బాబు ఉన్నాడు. వంశీ తల్లి లక్ష్మమ్మ ఆదివారం ఉదయం ఇంట్లో పనులు చేసుకుంటూ వాషింగ్ మెషీన్‌కు ఉన్న విద్యుత్ తీగను గమనించకుండా తాకడంతో విద్యుదాఘాతానికి గురైంది. ఆమె కేకలు వేయడంతో నిద్రపోతున్న వంశీ వెంటనే లేచి అక్కడికి వెళ్లాడు. తల్లిని పట్టుకుని లాగేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు బాధితుడిని పొదలకూరు సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే వంశీ మృతిచెందినట్టు వైద్యులు వెల్లడించారు. లక్ష్మమ్మ విద్యుదాఘాతంతో స్పృహ కోల్పోయినా ప్రాణాపాయం నుంచి బయట పడింది. తన ప్రాణాలు కాపాడే ప్రయత్నంలో బిడ్డ చనిపోవడంతో లక్ష్మమ్మ, ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. సమాచారం అందుకున్న ఎస్సై హనీఫ్ కేసునమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మరుపూరు ఎస్సీ కాలనీలో విషాదం నెలకొంది.

అధికారుల నిర్లక్ష్యం.. భక్తులకు ఇబ్బందులు


దర్గా ప్రధాన మార్గంలో కనిపించని సున్నం

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా ప్రాంగణమంతా బ్లీచింగ్, సున్నం చల్లాల్సి ఉంది. అయితే కొన్నిచోట్ల మాత్రమే చల్లుతూ మమ అనిపిస్తున్నారు. దీంతో అంటురోగాలు ప్రబలుతాయోనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండగకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారు. ఈ నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్ని ప్రదేశాల్లో బ్లీచింగ్, సున్నం ఎప్పటికప్పుడు చల్లుతూ ఉండాలి. అయితే దర్గా ప్రధాన రహదారిలో బ్లీచింగ్, సున్నం చల్లిన దాఖలాల్లేవు. సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరముంది.

క్వారీ డస్ట్ వల్ల..

దర్గా ప్రాంగణంలో ఎక్కడైతే సిమెంట్ రోడ్డు వేయలేదో ఆ ప్రాంతాల్లో క్వారీ డస్ట్ వేసి చదును చేశారు. అయితే డస్ట్‌పై నీరు చల్లడం మరిచిపోయారు. ఆదివారం ఉదయం నుంచి గాలి మొదలుకావడంతో డస్ట్ గాలికి ఎగిరి భక్తుల కళ్లలోకి చేరడంతో ఇబ్బంది పడ్డారు. స్టాల్స్‌లోనూ, దుకాణాల్లో తినుబండారాలపై డస్ట్ పడుతోంది. వాటిని కొనాలంటే భక్తులు వెనుకంజ వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా సంబంధిత అధికారులు నీళ్లు చల్లించాలన్న ఆలోచన కూడా చేయకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


దర్గా ప్రాంగణంలో క్వారీ డస్ట్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


ఘటనా స్థలంలో మృతదేహాలు

గుడ్లూరు: లారీని బొలెరో ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటన తెట్టు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై వెంకట్రావు కథనం మేరకు.. ఏలూరు జిల్లా కలిదిండి మూలలంక గ్రామానికి చెందిన కేతా సాయిబాబా (24), క్లీనర్ పుట్టా నాగరాజు (19) బొలెరో వాహనంలో చేపల లోడుతో బయలుదేరారు. హైదరాబాద్ నుంచి లారీ కర్ణాటకకు వెళ్తోంది. తెట్టు వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బొలెరో వాహనం తప్పించబోయి ఢీకొట్టింది. దీంతో సాయిబాబా, నాగరాజు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం కందుకూరు ఆస్పత్రికి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో..

- వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెంలో చోటు చేసుకుంది. ఎస్సై బి.సాయిప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన జి.శ్రీకాంత్ (37) మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యతో తరచూ గొడవ లు జరుగుతుండేవి. ఆమె ఇటీవల అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీకాంత్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇన్‌చార్జి డీఆర్వోగా హుస్సేన్ సాహెబ్

నెల్లూరు(అర్బన్): జిల్లా రెవెన్యూ ఇన్‌చార్జి అధికారిగా తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్‌ను నియమిస్తూ కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్వోగా పనిచేస్తున్న ఉదయభాస్కర్‌రావును ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. రెగ్యులర్ డీఆర్వోను నియమించేంత వరకు హుస్సేన్ సాహెబ్ ఇన్‌చార్జిగా కొనసాగుతారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు రూరల్: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక యథావిధిగా కొనసాగుతుందని కలెక్టరేట్ కార్యాలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై కలెక్టరేట్‌లో వినతిపత్రాలు అందించాలన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5

కనికరం లేకుండా..

పింఛన్ సొమ్ము.. ఇంటి పన్నుకు జమ


బాధితుడు నేలటూరి సుబ్బరాయుడు

ఆత్మకూరు: వృద్ధులు, దివ్యాంగుల పట్ల కూటమి ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయింది. గ్రామాల్లో ఇంటి పన్నులు చెల్లించలేదని పింఛన్‌లో కోత విధించి ఇస్తున్న వైనం ఆత్మకూరు మండలంలోని కనుపూరుపల్లి గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నేలటూరి సుబ్బరాయుడు కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేవాడు. పక్షవాతానికి గురై మూడేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో ఇంటి పన్ను చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల సచివాలయానికి చెందిన ఓ ఉద్యోగి పింఛన్‌లో రూ.1,000 తగ్గించి మిగిలింది చేతిలో పెట్టింది. ఇదేంటని అడిగితే పంచాయతీ కార్యదర్శి చెప్పాడని, అందుకే పింఛన్‌లో ఇంటి పన్ను మినహాయించుకుని మిగిలిన నగదు ఇచ్చినట్లు చెప్పారు. తమ వద్ద కూడా ఇదే విధంగా పింఛన్‌లో ఇంటి పన్ను నగదును జమ చేసుకుని మిగిలింది ఇచ్చారని కాలనీకి చెందిన వడిగ సుగుణమ్మ, బొడ్డు లక్ష్మమ్మ, దాసరి అయ్యన్న, నేలటూరి వెంకటయ్య, కటారి చిన్న పెంచలయ్య, గొర్రిపాటి శంకరయ్య తదితరులు వాపోయారు.

మరుసటిరోజు ఇంటి పన్నుకు సంబంధించిన రశీదులు ఇచ్చారన్నారు. బలవంతంగా పన్నులు వసూలు చేయడం ఏమిటని, దానిని పింఛన్‌కు ముడిపెట్టడం దారుణమని బాధితులు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత పంచాయతీ కార్యదర్శి, సచివాలయం ఉద్యోగిని వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- 34 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): నమ్మకంగా ఉంటూ నగలు కాజేసిన ఘటనలో నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు నిందితుడి వివరాలను వెల్లడించారు. వెంగళరావ్‌నగర్ ఏ బ్లాక్‌లో విశ్రాంత రైల్వే ఉద్యోగులు వెంకటేశ్వర్లు, కొండమ్మ దంపతులు నివాసముంటున్నారు. వారికి ముగ్గురు సంతానం. చిన్నకుమారుడు ప్రసన్నకుమార్‌కు వివాహం నిశ్చయమైంది. అతను గతనెల 29వ తేదీన బీరువాలోని తన బంగారు బ్రాస్‌లెట్, రెండు చైన్‌ల కోసం చూడగా అవి కనిపించలేదు. దీంతో వెంకటేశ్వర్లు ఈనెల 4వ తేదీన వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఎస్సై డి.విజయకుమార్ తన సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. పనిచేసే గణపతి నిందితుడని తేలడంతో ఆదివారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. వెంగళరావునగర్ ప్రాంతానికి చెందిన గణపతి కొంతకాలంగా వెంకటేశ్వర్లు ఇంట్లో పనిచేస్తూ నమ్మకంగా ఉండేవాడు. గతనెల 28వ తేదీన యజమానులు ఇంటి బయట ఉండగా బీరువాలోని 34 గ్రాముల రెండు బంగారు గొలుసులు, బ్రాస్‌లెట్‌ను అపహరించాడు. నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపి సిబ్బందిని డీఎస్పీ సింధుప్రియ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో..

- యువకుడి మృతి


నాని మృతదేహం

అల్లూరు: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చెందిన ఇరగాలదిన్నె నాని (21) శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో బిట్రగుంట పోలీస్‌స్టేషన్‌లో తల్లి శరణ్య ఫిర్యాదు చేశారు. తన కుమారుడిని అల్లిమడుగు సంఘానికి చెందిన కొందరు తీసుకెళ్లినట్లు ఆమె అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు నాని కోసం గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం అల్లూరు చెరువులో మృతదేహం లభ్యమైంది. దానిని శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కావలి రూరల్ సీఐ పాపారావు తెలిపారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కాకాణి పూజిత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. సంజీవయ్య మాట్లాడుతూ దేశంలో హరిత విప్లవానికి, కార్మిక విప్లవానికి ఆద్యులు జగ్జీవన్ రామ్ అని, అణగారిన వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందించేందుకు జీవితకాలం శ్రమించారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక పాలన ఎల్లకాలం సాగదని గుర్తుంచుకోవాలన్నారు. పూజిత మాట్లాడుతూ డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన గొప్ప విషయాలను దేశమంతా గుర్తు చేసుకుంటుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఆయన అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలు రాష్ట్రంలో అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నెల్లూరు సిటీ అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ సత్తార్, రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శులు స్వర్ణ వెంకయ్య, రవీంద్ర, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాకుటూరి లక్ష్మీసునంద, అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు పాల లావణ్య, మహిళా రాష్ట్ర కార్యదర్శి వెంకట జ్యోతి, మండల కన్వీనర్ మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల మొర ఆలకించండి


సమస్య పరిష్కరించాలని కోరుతున్న బాధితులు

ఆత్మకూరు: 'మా సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం మొర ఆలకించాలి' అని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని బైపాస్‌రోడ్డులో అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లతో ఆదివారం సాయంత్రం పీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో 10 లక్షల బాధిత కుటుంబాలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.906 కోట్లు జమైనట్లు తెలిపారు. 143 ఏజెంట్ కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో అందినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ సమస్యను పొందుపరిచిందని, ఆ మేరకు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అగ్రిగోల్డ్ ఆస్తులను పరిశీలించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. సమస్య పరిష్కారంలో కాలయాపన చేస్తే మరోసారి ఉద్యమం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు చౌడయ్య, మునీర్, సురేష్, శివయ్య, సుధాకర్, అజయ్, నాగేశ్వరరావు, కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.